# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :106 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 20 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 106 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 20 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## జిన్ పింగ్ తో భేటీ కానున్న మోడీ

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



ప్రధాని నరేంద్రమోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మరోసారి భేటీకాబోతున్నారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ఈ నెల 22 నుంచి 24 వరకు జరగనున్న బ్రిక్స్ సదస్సు ఇందుకు వేదిక కానుంది. జోహెన్నెస్‌బర్గ్‌లో జరిగే ఈ సదస్సుకు జిన్‌పింగ్ హాజరు అవుతారంటూ అధికారికంగా ప్రకటించింది చైనా

మిగతా 2లో...

## మరో 2 రోజులు
# వానలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వారం పది రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు మళ్లీ విజృంభించాడు. దాదాపు రెండు వారాల విరామం తర్వాత తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో శుక్రవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఇక రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు, అధికార యంత్రాంగం

మిగతా 2లో...

# వంద రోజుల ముందే జాబితా

# బీజేపీ–బీఆర్ఎస్ మధ్య.. యాదాద్రి వార్




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఎన్నికలకు వందరోజుల ముందుగానే బీజేపీ పార్టీ నుంచి అభ్యర్థులను ప్రకటించడం అనేది ఊహించని పరిణామం. షెడ్యూల్ రాకముందే బీజేపీ ఎన్నికల కమిటీ భేటీ మల్లాగుల్లాలు పడటం మరో విశేషం. అయితే ఈ నేపథ్యంలో కష్టతరమైనటువంటి నియోజకవర్గాల జాబితాను విడుదల చేయడం వల్ల బీజేపీ ఎలాంటి సంకేతాలు పంపిందనేది పరిశీలిస్తే దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటక వ్యూహం కనిపిస్తోంది. ఇక వివరాల్లోకి వెళ్తే కర్ణాటక ఎన్నికల సమయంలో అక్కడి అభ్యర్థును ముందుగానే ప్రకటించి విజయవంతమైంది కాంగ్రెస్ పార్టీ. పేర్లు ప్రకటించిన అనంతరం వెంటనే క్షేత్రస్థాయిలోకి అభ్యర్థులు బరిలోకి దిగిపోయారు. ముమ్మరంగా ప్రచారాలు చేసుకున్నారు. తమ పార్టీ అందించబోయే సంక్షేమం గురించి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత

మిగతా 3 లో...

నల్గొండ- ప్రభాత సూర్యుడు

విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాదాద్రి థర్మల్ ప్లాంట్ ను నిర్మిస్తోంది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో జుఖూ నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదు యూనిట్లకు జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతినిచ్చింది. అదే ఏడాది అక్టోబరు 17న రూ.29 వేల కోట్ల అంచనా వ్యయంతో జెన్ కో నిర్మాణం ప్రారంభించి.. భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్

మిగతా 3 లో...

## భారతీయ భాషల్ని అనువదించే స్పెషల్
# ఏఐ పోర్టల్ భాషిణి



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. బెంగళూరులో జరుగుతున్న జీ20 డిజిటల్ ఎకానమీ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని...ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే భారత్

మిగతా 2లో...

# షర్మిల.. వ్యూహామేమిటో..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



అన్నీ అయిపోయాయ్. రేపోమాపో కాంగ్రెస్‌లో కలవడమే మిగిలిందనుకున్నారు. తను కూడా ఢిల్లీ పెద్దలకు టచ్‌లో ఉన్నారు. కర్నాటక పీసీసీ చీఫ్ డీకేతో అన్ని అంశాలు మాట్లాడుతున్నారు. కానీ నేడోరేపో అంటున్నా ఆ ప్రక్రియ దిశగా అడుగుపడటం లేదు. ఆమె కూడా అవునని ఒప్పుకోవడం లేదు. కాదని ఖండించడం లేదు. కాంగ్రెస్‌లో చేరతారో లేదోగానీ.. మళ్లీ అమ్ములపొదిలోని అస్త్రాలైతే బయటికి తీస్తున్నారు వైఎస్ షర్మిల. గ్యాప్ రాలేదు.. నేనే తీసుకున్నానన్నట్టు మళ్లీ న్యూస్‌లోకొచ్చారు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌కి టూర్ ప్లాన్ చేసుకున్నారు. అయితే పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు షర్మిలను హౌస్ అరెస్ట్ చేయటంతో లోటస్‌పాండ్ దగ్గర కాసేపు టెన్షన్ వాతావరణం నడిచింది. కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేస్తారన్న ప్రచారం తర్వాత.. కొన్నాళ్లు సైలెంట్‌గా ఉన్నారు వైఎస్ షర్మిల. కానీ మళ్లీ ఇప్పుడు యాక్టివ్ కావటంతో కాంగ్రెస్‌లో ఆమె చేరిక ఉన్నట్టా లేనట్టా అన్న చర్చ మొదలైంది. పోలీసులు తనను ఇల్లు కదలనివ్వకపోవటంతో.. వారికి హారతి ఇచ్చి మరీ నిరసనకు దిగారు షర్మిల.తాజా పరిణామాలతో అవసరమైతే ఒంటరి పోరాటానికైనా సిద్ధమేనన్న సంకేతాలిచ్చారు వైఎస్ షర్మిల. తన ప్రతిపాదనలకు ఒప్పుకుంటేనే

మిగతా 2 లో...

## మహిళపై దాడి... నివేదిక ఇవ్వాలని
# గవర్నర్ ఆదేశం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆడది అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగిన నాడే మనకు అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మహాత్మాగాంధీ చెప్పిన మాట తరచుగా ఏదో చోట వినిపిస్తుంది. కానీ తెలంగాణలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు అర్ధరాత్రి సమయంలో ఓ మహిళపై ఇద్దరు పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారు. మహిళ అని కూడా చూడకుండా ఆగస్టు 15న రాత్రి 11 గంటల తర్వాత ఎల్బీనగర్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఆపై లాఠీలతో దారుణంగా కొట్టి ఆమెను హింసించడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటనపై రాష్ట్ర

మిగతా 2లో...

## తెలంగాణ కాంగ్రెస్
# టిక్కెట్ల కోసం క్యూ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ల రేస్ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దాంతో, గాంధీభవన్ కోలాహలంగా మారింది. ఎమ్మెల్యే టికెట్ కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు లీడర్లు. తమ బలాబలాలను ప్రస్తావిస్తూ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎప్పట్నుంచి పార్టీలో ఉన్నారో?. ఎంత లాయల్టీగా ఉన్నారో? పార్టీ కోసం ఏమేం చేశారో? నియోజకవర్గంలో ఎంత పట్టుందో? సామాజికంగా ఉన్న ప్లస్‌లు!, ఇలా దేన్నీ వదలకుండా సకల అస్త్రాలను అప్లికేషన్‌లో పొందుపరుస్తూ దరఖాస్తు చేసుకుంటున్నారు నేతలు.ఆగస్ట్ 25వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు!. ఆ తర్వాత అప్లికేషన్లను వడబోసి, స్క్రీనింగ్ కమిటీకి పంపుతుంది ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ .. అభ్యర్థుల్ని ఫైనల్ చేస్తుంది. ఒకవేళ అక్కడ కూడా అభ్యర్థి ఎంపిక

మిగతా 2లో...

## ఇప్పటిదాకా చూసింది కేవలం ట్రైలర్ మాత్రమే
### త్వరలో ప్రతిపక్షాలకు
# బిఆర్ఎస్ పార్టీ సినిమా వుంది

**మంత్రి కే. తారక రామారావు**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




ఇందిరా పార్క్ కు నుంచి వి ఎస్ టి చౌరస్తా వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జిను ( నాయిని నరసింహారెడ్డి ఫ్లై ఓవర్) పురపాలక శాఖ మంత్రి కే. తారక రామారావు శనివారం ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చినంక కట్టిన 20వ ఫ్లై ఓవర్ ఇది. ఎస్ఆర్డీపీ కార్యక్రమంలో అద్భుతమైన రోడ్డు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేసుకుంటున్నాం. అద్భుతమైన అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటిదాకా 36 పనులను పూర్తి చేశాము. గత ప్రభుత్వాలు హైదరాబాద్ సెంట్రల్ నగరాన్ని పెద్దగా పట్టించుకోలేదు కానీ తెలంగాణ వచ్చిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నూతన సచివాలయం, అమరవీరుల స్తూపం, బాబాసాహెబ్

మిగతా 3లో...

## గద్దర్ కుమారుడికి
# కాంగ్రెస్ టిక్కెట్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రజా యుద్ధనౌక గద్దర్ గొంతు మూగబోయింది కానీ.. ఆయన చివరి రోజుల్లో ప్రజాస్వామ్య రాజకీయాలు చేయాలనుకున్నారు. సొంత పార్టీ పెట్టారు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఇతర పార్టీలతో కన్నా కాంగ్రెస్ తో ఎక్కువ

మిగతా 2లో...

## మరో 2 రోజులు
# వానలు

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈశాన్య బంగాళాఖాతం,దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో బుధవారం కొనసాగిన అల్పపీడన ద్రోణి ఇప్పుడు వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలకు విస్తరించిందని తాజా వాతావరణ విశ్లేషణ సూచిస్తుంది.తెలంగాణలో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈశాన్య బంగాళాఖాతం ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని సూచించింది. పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒరిస్సా తీరాల మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నేడు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు పలు జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఎల్లో అలర్ట్‌లు జారీ చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారుకామారెడ్డి, మెదక్, సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, జనగాం, భువనగిరి, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట్, గద్వాల్ జిల్లాల్లో గ్రీన్ అలర్ట్ ప్రకటించారు వాతావరణ అధికారులు.

## తెలంగాణ కాంగ్రెస్
# టిక్కెట్ల కోసం క్యూ

(మొదటి పేజీ తరువాయి)

తేలకపోతే సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుంది.ఎంత పెద్ద లీడర్ అయినాసరే కాంగ్రెస్ తరపున పోటీ చేయాలనుకుంటే మాత్రం దరఖాస్తు చేసుకోవాల్సిందే అంటున్నారు రేవంత్. చివరికి, పీసీసీ అధ్యక్షుడైనా, సీఎల్పీ నేత అయినాసరే దరఖాస్తు చేసుకోవాల్సిందే!. మేం సీనియర్లం, అనుభవం ఉందని ఎవరికి వాళ్లు టికెట్లను ప్రకటించుకుంటే కుదరదని తేల్చిచెప్పేశారు రేవంత్‌రెడ్డి. ఇంతవరకు బానే ఉంది. కానీ.. అభ్యర్థులకు నియోజకవర్గాల్లో ఉన్న అసంతృప్తి సెగల మాటేంటి.. ఇల్లు చక్కదిద్దుకోలేని వాడు..దేశాన్నేం ఉద్ధరించదగలడు.అయితే, కర్నాటకలో గెలిచామని కాలర్ ఎగరేశారు. ఇక తెలంగాణలోనూ సత్తా చాటుతామని.. ధీమా వ్యక్తం చేశారు. తీరా చూస్తే వ్యవహారం వేరేలా కనిపిస్తోంది. గాంధీభవన్‌లో ఎంత జోష్ కనిపిస్తోందో.. అదే స్థాయిలో నిరసన గళం వినిపిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్నవేళ.. ఇది, హస్తం పార్టీని గందరగోళంలోకి నెడుతోంది. అవును, మేమింతే అదో టైపు అంటున్నారు తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. పొంగులేటి ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్ కావడం.. ఇదంతా చూశాక ఇక పార్టీ గాడిన పడ్డట్టే అనుకున్నారంతా.. కానీ పొంగులేటి చేరికపై స్థానిక నాయకుల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.ఎంత జోష్ వచ్చినా.. ఏం లాభం? ఎన్నికలు సమీపిస్తున్నవేళ.. అదే స్థాయిలో అసమ్మతి గళానికీ వేదికవుతోంది గాంధీ భవన్. మునుగోడు కాంగ్రెస్ నేతలు.. ఏకంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఎదుటే ఆందోళనకు దిగారు. మునుగోడు మండల కమిటీలన్నీ..చలిమల కృష్ణారెడ్డి వర్గానికే ఇచ్చారంటూ.. పాల్వాయి స్రవంతి వర్గం గాంధీభవన్‌లో బైఠాయించింది. పాల్వాయి స్రవంతి, కైలాష్ నేతలకి తెలియకుండా నిర్ణయం తీసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గాంధీభవన్‌లో గందరగోళం ఏర్పడింది.తెలంగాణ వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితులు.. ఎప్పుడు భగ్గుమంటాయోనన్న ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# జిన్ పింగ్ తో భేటీ కానున్న మోడీ

(మొదటి పేజీ తరువాయి)

విదేశాంగశాఖ. భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు చివరిసారిగా గతేడాది ఇండోనేషియా బాలిలో జరిగిన జీ20 సదస్సులో మాట్లాడుకున్నారు. అంతకుముందు ఉజ్బెకిస్తాన్‌లో ఒకే వేదికను పంచుకున్నా కనీసం పలకరించుకోలేదు మోదీ-జిన్‌పింగ్. దాంతో, ఇరువురి భేటీపై ఆసక్తి నెలకొంది.సౌదీ అరేబియా, యూఏఈ వంటి సన్నిహిత మిత్ర దేశాలు బ్రిక్స్‌లో చేరాలని భావిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోడీ దక్షిణాఫ్రికా పర్యటన చాలా కీలకమైంది. ఈ ఏడాది బ్రిక్స్ సదస్సులో అంతర్జాతీయ వ్యవహారాలు, పాశ్చాత్త దేశాల ఆధిపత్యం, భౌగోళిక రాజకీయ శక్తిగా ఎలా ఎదగాలనే అంశాలపై చర్చించనున్నారు. అయితే, భారత్-చైనా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న టైమ్‌లో మోదీ-జిన్‌పింగ్ భేటీ ఆసక్తి రేపుతోంది. మరోవైపు బ్రిక్స్‌లో చేరేందుకు దాదాపు 25 దేశాలు దరఖాస్తు చేసుకున్నాయి. వాస్తవానికి బ్రిక్స్ ఐదు దేశాల సంస్థ.. దీనిని మరింతగా విస్తరించాలా వద్దా అనే దానిపై జోహన్నెస్‌బర్గ్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.

## షర్మిల..
# వ్యూహామేమిటో..!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేరాలన్న పట్టుదలతో ఆమె ఉన్నట్టు కనిపిస్తోంది. పాలేరు నుంచి పోటీచేస్తానని ఇప్పటికే ప్రకటించిన షర్మిల.. కాంగ్రెస్ పార్టీ ముందు కొన్ని ప్రతిపాదనలు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. తన మద్దతుదారులకు కూడా షర్మిల కొన్ని సీట్లు అడుగుతున్నారన్న మాట వినిపిస్తోంది. అయితే కాంగ్రెస్‌లో షర్మిల చేరికని.. టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు కొందరు కాంగ్రెస్ సీనియర్లు ఆమెకు వెల్‌కం చెబుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్‌లో విలీనానికి అంగీకరించినా అసెంబ్లీకి షర్మిల పోటీపై మాత్రం ససేమిరా అంటున్నారట రేవంత్. అక్కడే మెలికపడిందని, అవసరమైతే షర్మిలను లోక్‌సభకు పోటీ చేయించడానికి, రాజ్యసభకు పంపడానికి కూడా కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నది ఇంటర్నల్ టాక్.టీ కాంగ్రెస్‌లో కొందరు సూచిస్తున్నట్లు ఏపీ పాలిటిక్స్‌పై షర్మిల ఆసక్తిగా లేరు. పార్టీ కేంద్రనాయకత్వంతో మాట్లాడుతున్న డీకేతో అదే విషయం చెప్పేశారట షర్మిల. పార్టీని రద్దు చేసి కాంగ్రెస్‌లో చేరడమా, లేదంటే కాంగ్రెస్‌లో వైఎస్సార్‌టీపీని విలీనం చేయడమా అన్న రెండు ప్రతిపాదనలు కూడా షర్మిల ముందు ఉన్నాయంటున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. షర్మిల చేరిక పార్టీకి ఎంతోకొంత మేలు జరుగుతుందన్న అంచనాతో ఉంది. కానీ ఆమె డిమాండ్లు, టీపీసీసీ చీఫ్ అభ్యంతరాలతోనే.. ఉభయతారకంగా ఉండే నిర్ణయం విషయంలో ఆలస్యమవుతోంది. ఈలోపు నా దారి నాకుందన్న సంకేతాలిచ్చేందుకే మళ్లీ షర్మిల యాక్టివ్ అవుతున్నారన్నది కొందరి ఒపీనియన్. అసలే రాజన్నబిడ్డ.. అంతీజీగా రాజీపడుతుందా? చెప్పండి.

### ఐదు సెగ్మెంట్లు...ఇవ్వాల్సిందే

పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు సెగ్మెంట్లు ఇవ్వాలన్న డిమాండును వైఎస్సార్ తెలంగాణ పార్టీ చీఫ్, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిల ఆ పార్టీ హైకమాండ్ ముందుంచిందా.. అలా అయితేనే విలీన ప్రక్రియకు సై చెతానని షర్మిల షరతు పెట్టిందా.. అంటే అవుననే అంటున్నారు ఇరు పార్టీల నేతలు. తన తండ్రి రాజశేఖర్ రెడ్డి కన్న కలలను నిజం చేయాలన్న ఉద్దేశంతో షర్మిల తెలంగాణాలో కొత్త పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ఎదుర్కొంటు న్న సమస్యలను తెలుసుకునేందుకు ఆమె సుదీర్ఘ పాదయాత్ర కూడా చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న షర్మిల మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ షర్మిలతో సంప్రదింపులు జరిపి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. భర్త అనిల్, పార్టీ ముఖ్యులతో సుదీర్ఘ మంతనాల అనంతరం షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు పలు దఫాలు ఢిల్లీ వెళ్లిన బ్రదర్ అనిల్ కుమార్ కాంగ్రెస్ పెద్దలతోనూ వరుస భేటీలు నిర్వహించి విలీన ప్రక్రియ, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పాత్రపై చర్చినట్టు వార్తలొచ్చాయి. నాలుగు రోజుల క్రితం షర్మిల, అనిల్ హస్తిన వెళ్లి కాంగ్రెస్ పార్టీ ముఖ్యులతో సమావేశమై విలీన ప్రక్రియ ముహుర్తాన్ని ఖరారు చేసుకున్నారని ప్రచారం జరిగింది. బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్లిన షర్మిల అంతకుముందు డీకే శివకుమార్ తో ప్రత్యేకంగా సమావేశమై సమాలోచనలు జరిపినట్టు సమాచారం. పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తున్న విషయాన్ని షర్మిల పార్టీ సీనియర్లతో సమావేశమై చెప్పి వారి అభిప్రాయాలను సేకరించినట్టు తెలుస్తోంది. వరుసగా రెండు రోజులపాటు ఆమె ఇక్కడి లోటస్ పాండ్ లోని పార్టీ కార్యాలయంలో నేతలను కలుస్తూ వారితో చర్చిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో మరో దఫా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ లతో సమావేశం కావాలని నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ విలీనం తర్వాత జరగనున్న పరిణామాలను అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఇచ్చే సీట్ల విషయంలో స్పష్టతకు రావాలని భావిస్తున్నట్టు సమాచారంమరో నాలుగైదు నెలల్లో తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో షర్మిల ఐదు అసెంబ్లీ స్థానాలను కోరే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే సీట్ల సర్దుబాటు విషయంలో ఎటూ తేల్చుకోలేని నిస్సహాయ స్థితిలో తెలంగాణ కొట్టు మిట్టాడుతోంది. తాజాగా షర్మిల ఎంట్రీ ఇవ్వడంతో ఏం చేయాలో తెలియక తలపట్టుకుంటున్నట్టు సమాచారం. ఒక వైపు డీకే శివకుమార్ పట్టుబట్టి షర్మిల పార్టీని విలీనం చేసే దిశగా చర్యలు చెపట్టారని, ఇప్పుడు ఈ విషయంలో వెనక్కు తగ్గినా ప్రక్రియను వ్యతిరేకించినా వచ్చే ఎన్నికల్లో ఆయన మద్దతు ఉండదన్న ఆందోళన పీసీసీ నేతల్లో వ్యక్తమవుతున్నట్టు సమాచారం. షర్మిల కోరుతున్నట్టు ఐదు అసెంబ్లీ స్థానాలివ్వడానికి రాష్ట్ర కాంగ్రెస్ సిద్ధంగా లేదన్న సంకేతాలను పార్టీ ముఖ్యనేతలు డీకే శివకుమార్ కు పంపించినట్లు సమాచారం. ఖమ్మం జిల్లా పాలేరు, ఉమ్మడి వరంగల్ జిల్లా డోర్నకల్, ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి లేదా నకిరేకల్, సికింద్రాబాద్ స్థానాలను షర్మిల కోరుతున్నట్టు చెబుతున్నారు. పాలేరు నుంచి తాను పోటీ చేస్తానని షర్మిల ఇప్పటికే ప్రకటించడంతో పాటు అక్కడ పార్టీ కార్యాలయాన్ని, నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. షర్మిల అనుచరుడు ఏపూరు సోమన్న తుంగతుర్తి నుంచి పోటీకి సిద్ధమయ్యారు. మహబూబాబాద్ అసెంబ్లీ నుంచి సుజాతను బరిలో నిలిపే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ఐదు సీట్లు కోరుతున్న షర్మిలకు నచ్చజెప్పి రెండు స్థానాలను ఇవ్వాలన్న ప్రతిపాదన కాంగ్రెస్ పెద్దల్లో ఉన్నట్టు చెబుతున్నారు. అప్పటికీ ఆమె మరో సీటు కోసం పట్టుబడితే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్టు వినికిడి. ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్న షర్మిల అక్కడే పార్టీ పెద్దలను కలిసి అన్ని విషయాలు మాట్లాడుకోవాలని ప్రతిపాదించారని ఆమె సన్నిహిత నేతలు వివరించారు. ఏది ఏమైనా.. షర్మిలా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం మాత్రం ఖాయం.

# భారతీయ భాషల్ని అనువదించే స్పెషల్ ఏఐ పోర్టల్ భాషిణి

(మొదటి పేజీ తరువాయి)

ఏఐ టెక్నాలజీతో ఓ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ ప్లాట్‌ఫామ్‌ని తయారు చేస్తోందని వెల్లడించారు. భారత్‌లోని భాషా వైవిధ్యానికి తగ్గట్టుగా ఇది అన్ని భాషల్లోనూ తయారవుతోందని చెప్పిన ప్రధాని ఈ ప్లాట్‌ఫామ్‌కి “భాషిణి అనే పేరు పెట్టినట్టు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు ఇంటర్నెట్ డేటా అందిస్తున్న దేశం భారత్ మాత్రమే అని చెప్పిన ఆయన త్వరలోనే ఇండియాలో డిజిటలైజేషన్ ఊహించిన దాని కన్నా వేగంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు.భారత్‌లో ప్రస్తుతానికి 85 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్స్ ఉన్నారని, వీళ్లందరూ తక్కువ ధరకే ఇంటర్నెట్ డేటాని పొందుతున్నారని వెల్లడించారు. డిజిటల్ ఇండియా పథకంలో భాగంగా...భాషిణి పోర్టల్ ద్వారా ఇప్పుడున్న 10 భారతీయ భాషలతో పాటు, మొత్తం 22 భాషల్లోకి ట్రాన్స్‌లేషన్ వెసులుబాటు కలుగుతుంది. డిజిటల్ ఇండియాలో భాగంగా ఈ భాషిణి పోర్టల్‌ని తయారు చేస్తోంది కేంద్రం. భారతీయ భాషల మధ్య ఉన్న బ్యారియర్స్‌ని తొలగించి అన్ని భాషల్నీ అనుసంధానించాలన్నదే ఈ పోర్టల్ ముఖ్య ఉద్దేశం. చిన్న మధ్య తరహా పరిశ్రమలు, అంకుర సంస్థలు...ఈ పోర్టల్‌ని సులువుగా వినియోగించుకునేలా తయారు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న ఏఐ టెక్నాలజీతో ఇది రూపు దిద్దుకుంటోంది. సొంత భాషలోనే డిజిటల్ సర్వీస్‌లను వినియోగించుకునేలా ఇది తోడ్పడుతుంది. అన్ని ఆండ్రాయిడ్, తిూా ప్లాట్‌ఫామ్‌లలో ఇది అందుబాటులో ఉంటుంది.

ఇందులో సునో ఇండియా, లిఖో ఇండియా, బోలో ఇండియా, దేఖో ఇండియా అనే ఆప్షన్స్ ఉంటాయి. ఓ తెలియని భాషను విన్నప్పుడు వెంటనే దాన్ని ఈ పోర్టల్‌లో టైప్ చేస్తే...అందుకు తగ్గట్టుగా టెక్స్ట్, ట్రాన్స్‌లేషన్ అందులో కనిపిస్తాయి. అంటే తెలియని భాష గురించి తెలిసిన భాషలో నేర్చుకోవడానికి వీలుంటుంది. 2001 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో 22 అధికారిక భాషలున్నాయి. 122 ఎక్కువగా వినియోగించే భాషలతో పాటు 1,599 ఇతర భాషలున్నాయి. అయితే...ప్రస్తుతం ఇంటర్నెట్‌లోని కంటెంట్ ఎక్కువగా ఇంగ్లీష్‌లోనే ఉంటోంది. ఇలా కాకుండా అన్ని స్థానిక భాషల్లోనూ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తయారు చేసిందే భాషిణి పోర్టల్. డేటా తక్కువ ధరకే లభిస్తుండడం, స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరగడం వల్ల ఈ పోర్టల్‌తో చాలా ఉపయోగాలుంటాయని కేంద్రం భావిస్తోంది. ఔజీబితినీనిజీశ్రీ ఒజీనిణబీజీణవ ఎతీజీనిబశ్రీజీబితినీని ఓతిబబతినీని (ఔబుఓ) ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది.

## గద్దర్ కుమారుడికి
# కాంగ్రెస్ టిక్కెట్

(మొదటి పేజీ తరువాయి)

సన్నిహితంగా ఉన్నారు. గద్దర్ చనిపోయిన తర్వాత కూడా టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎక్కువ బాధ్యత తీసుకున్నారు. గద్దర కుటుంబానికి అన్నీ తానై వ్యవహరించారు. ఇప్పుడు గద్దర్ చివరి కోరికను ఆయన కుమారుడి ద్వారా తీర్చాలని రేవంత్ అనకుంటున్నట్లుగా చెబుతున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా రేవంత్ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెబుతున్నారు.గద్దర్ మొదటి నుంచి విప్లవ పంథాలోనే ఉన్నారు. ఆయనకు ప్రజాస్వామ్యంపై ..ఓటు రాజకీయాలపై నమ్మకం లేదు. కానీ తర్వాత మనసు మార్చుకున్నారు. ఓటు హక్కు నమోదు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తన వయసు సహకరించకపోయినా తన కుమారుడు సూర్యంను రాజకీయాల్లోకి తెచ్చి నాయకుడ్ని చేయాలని అనకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీతో సన్నిహితంగా ఉంటున్నారు. రాహుల్ హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలిశారు. తర్వాత కుటుబంతో సహా ఢిల్లీకి వెళ్లి కలిశారు. రేవంత్ రెడ్డి కూడా గద్దర్ విషయంలో సానుకూలంగా ఉన్నారు. ఇప్పుడు గద్దర్ మరణంతో ఆయన కుమారుడికి రాజకీయ భవిష్యత్ ను కల్పించాలని రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా చెబుతున్నారు. టిక్కెట్ల కసరత్తులో చాలా కాలంగా ఉన్న రేవంత్ రెడ్డి కొన్ని రిజర్వుడు నియోజకవర్గాల్లో గద్దర్ కుమారుడి అభ్యర్థిత్వం స్వింగ్ ఓట్లను తెచ్చి పెడుతుందని నమ్ముతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని రేవంత్ సీరియస్ గా పరిశీలిస్తున్నారు. అక్కడ సర్వేలు నిర్వహిస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దళిత వర్గం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గద్దర్ వారసుడు చట్టసభల్లోకి వెళ్లేలా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రేవంత్ చెబుతున్నారు. గద్దర్ కుమారుడు కూడా రాజకీయాలపై ఆసక్తిగా ఉన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో ఉన్న సూర్య ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇస్తే వదులుకోనని చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీకి పోటీ చేయించలేకపోతే.. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి పోటీచేయించాలని కూడా రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. గద్దర్ మంచి స్వభావం ఉన్న వ్యక్తి.. ఆయన లేకున్నా.. కుమారుడి రూపంలో చూడాలని.. టికెట్ ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలువాలని కాంగ్రెస్ భావిస్తోందని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఢిల్లీ హైకమాండ్‌కు కూడా రేవంత్ చేరవేసినట్లు.. అక్కడ్నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందని అంటున్నారు. గద్దర్ పై ఒక్క దళిత వర్గాల్లోనే కాదు.. అభ్యుదయ భావాలు ఉన్న ప్రతి ఒక్కరిలో అభిమానం ఉంది. అది ఓట్ల రూపంలోకి మారితే కాంగ్రెస్‌కూ మేలు చేస్తుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నరు.

## మహిళపై దాడి...
## నివేదిక ఇవ్వాలని
# గవర్నర్ ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర స్థాయిలో స్పందించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన తమిళిసై... మహిళపై జరిగిన దారుణ ఘటనపై వెంటనే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ లను ఆదేశించారు. 48 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. బాధిత మహిళకు అండగా ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీకి గవర్నర్ సూచించారు.ఆగస్టు 15 రాత్రి 11 గంటలకు ఎల్బీనగర్ చౌరస్తాలో పోలీసులకు ముగ్గురు మహిళలు కనిపించారు. స్థానికంగా ఇబ్బంది కలిగిస్తున్నారంటూ వారిని పీఎస్ కు తరలించారు. సెక్షన్ 290 కింద కేసు నమోదు చేశారు. తమను ఎందుకు తీసుకొచ్చారని మీర్‌పేటకు చెందిన మహిళ ప్రశ్నించగా.. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు శివశంకర్, సుమలత ఆ మహిళను లాఠీలతో దారుణంగా కొట్టారు. రాత్రంతా స్టేషన్ లో ఉంచి లాఠీలతో కొట్టారని బాధితురాలు ఆరోపిస్తోంది. అలాగే తన శరీరంపై లాఠీతో కొట్టినట్లుగా ఉన్న గాయాలను కూడా చూపిస్తోంది. ఆగస్టు 15వ తేదీ రాత్రి సమయంలో తాను ఇంటికి వెళుతుండగా.. పోలీసులు వచ్చి వాహనంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారని.. సెల్ ఫోన్ లాక్కొని చిత్ర హింసలకు గురి చేశారని ఆరోపించింది. బుధవారం ఉదయం తనను ఇంటికి పంపించినట్లు చెప్పింది. అయితే ఆమె చేస్తున్న ఆరోపణలు అన్నీ నిజం కాదని.. ఎల్బీ నగర్ ఇన్ స్పెక్టర్ తెలిపారు. మీర్ పేట నంది హిల్స్ లో బాధితురాలు నివాసం ఉంటుండగా... ఆమెతో పాటు ఆమె బంధువులు అందరూ పోలీస్‌స్టేషన్ లో ఆందోళనకు దిగారు. ఎల్బీ నగర్ జంక్షన్ వద్ద ముగ్గురు మహిళలు పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం వచ్చిందని ఎల్బీ నగర్ డీసీపీ సాయి శ్రీ తెలిపారు. 16వ తేదీ తెల్లవారుజామున పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చామని.. ఐపీసీ - 209 సెక్షన్ కింది కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఈ కేసులో రాచకొండ సీపీ చౌహాన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు పోలీసులపై వేటు వేశామని చెప్పారు. మహిళపై దాడికి పాల్పడ్డ హెడ్ కానిస్టేబుల్ శివ శంకర్, మహిళా కానిస్టేబుల్ సుమలతను సస్పెండ్ చేస్తూ సీపీ చౌహాన్ ఆదేశించారు. మహిళపై దాడి ఘటనపై విచారణ చేసి నివేదిక తెప్పించుకున్న సీపీ.. ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## సంపాదకీయం

### ఆదాయం సరే.. భక్తుల భద్రత సంగతేంటీ...

సుమారు 1500 సంవత్సరాల క్రితం తిరుమలలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల ఆధ్యాత్మిక మనోభావాలకు నిలువుటద్దం అనడంలో ఎటువంటి సంశయం లేదు. ప్రతి రోజు ఎనభై వేల నుంచి లక్ష వరకు భక్తులు ఆపద మొక్కుల వారి దర్శన భాగ్యం కొరకు తిరుమలకు వస్తూ ఉంటారు. వారిలో ఇరవై వేల నుంచి ముప్పై వేల మంది వరకు అలిపిరి నడక మార్గంలో వస్తూ ఉండడం గమనార్హం. కనుక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, అలిపిరి నడక మార్గం యొక్క ప్రస్థానం, ప్రాముఖ్యత, పవిత్రతను పరిగణన లోకి తీసుకుని కంచె నిర్మాణం విషయంలో అటవీ శాఖ సానుకూలంగా స్పందించాల్సి ఉంది. భక్తులు, ప్రజల ప్రాణాల పట్ల అటవీ శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని గత కొద్ది కాలంగా ప్రజలు భావిస్తున్నారు. సోమవారం ఉదయం చిన్నారి లక్షిత మృతదేహం లభ్యమైన శ్రీ నరసింహ స్వామి దేవాలయం సమీపాన సోమవారం ఉదయం ఒక చిరుత బోనులో చిక్కింది. అదే సోమవారం రోజు రాత్రి వేంకటేశ్వర యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్ లో చిరుత సంచరించి అక్కడి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసింది. అదేవిధంగా గతంలో కూడా అటవీ ప్రాంతం దాటి జనావాసాలైన తిరుపతిలోని రుయా ఆసుపత్రి, స్విమ్స్, పద్మావతీ ఆసుపత్రి ప్రాంగణాలలో చిరుత సంచరించి కలకలం సృష్టించింది. తిరుమల నడకదారిలో ఆరేళ్ళ లక్షిత అనే చిన్నారిని చిరుత బలి తీసుకోవడం బాధాకరం. జూన్ 23వ తేదీ కౌశిక్ అనే అయిదు సంవత్సరాల బాలుడు చిరుత దాడిలో గాయపడ్డాడు. ఇలా వరుస ఘటనలతో కాలిబాటన శ్రీవారి దర్శనానికి వెళ్ళే భక్తులు బెంబేలెత్తుతున్నారు. భక్తులలో నెలకొన్న భయాందోళనలు తొలగించి వారిలో ధైర్యం నింపవలసిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది. అందులో భాగంగా టీటీడీ పాలకమండలి నూతన అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులతో ఇటీవల అత్యవసరంగా టీటీడీ హైలెవల్ కమిటీ సమావేశం నిర్వహించి భక్తుల భద్రతకు టీటీడీ అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం. ఆ నిర్ణయాలలో కాలినడకన తిరుమల వెళ్ళే ప్రతి భక్తునికి చేతి కర్ర ఇవ్వడం, అలిపిరి నుండి తిరుమల వరకు వన్య ప్రాణుల కదలికలు గుర్తించేందుకు అయిదు వందల కెమరా ట్రూప్లు, డ్రోన్‌ల ఏర్పాటు, కీలక ప్రాంతాలలో ఇరువైపులా ముప్పై అడుగుల వరకు ఫోకస్ లైట్ల ఏర్పాటు, అలిపిరి, గాలిగోపురం, ఏడవ మైలురాయి వద్ద సూచికలు, లఘు చిత్రాలు ప్రదర్శించి స్వీయ రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి భక్తులకు తెలియచేయడం, పన్నెండు సంవత్సరాల లోపు పిల్లలను ఉదయం అయిదు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల లోపు మాత్రమే నడక దారిలో శేషాచలవాసుని దర్శనానికి అనుమతించడం, ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను అనుమతించడం, జంతువుల సంచార పర్యవేక్షణ కొరకు వైల్డ్ లైఫ్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి దానిలో 24 గంటలు వైద్యులను అందుబాటులో ఉంచడం , తర్ఫీదు పొందిన ఫారెస్ట్ సిబ్బందిని అడుగడుగునా భక్తుల భద్రత కొరకు నియమించడం, నడక మార్గంలో వ్యర్థ పదార్థాలు వేసే హోటళ్ళ, దూకాణాదారుల యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంది. నడక దారిలో గుంపులు గుంపులుగా వెళ్ళమని మరియు సాదు జంతువులకు ఆహారపదార్థాలు పెట్టవద్దని భక్తులకు టీటీడీ సూచించింది. కేంద్ర అటవీశాఖాధికారుల సూచనలకు అనుగుణంగా నడక మార్గంలో కంచె ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని టీటీడీ నిర్ణయించింది. నడక దారిలో కంచె ఏర్పాటు చేయమని దశాబ్దాల తరబడి భక్తులు ప్రభుత్వాన్ని,టీటీడీ అధికారులను కోరుతున్నారు. ఆ ప్రదేశంలో కంచె నిర్మించాలంటే కేంద్ర అటవీశాఖ ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. భక్తుల భద్రతకు టీటీడీ ఎంత ప్రాముఖ్యత ఇస్తుందో ! అటవీ శాఖ వారు కూడా వన్య ప్రాణుల ప్రాణాలు, భద్రతకు అంతే ప్రాముఖ్యత ఇస్తారు. ఈ పరిణామం వల్లే టీటీడీ అధికారులు, అటవీ శాఖా అధికారుల మధ్య సమన్వయం లోపించిందనే వార్తలు చాలా కాలంగా ప్రజలలో బలంగా ఉన్నాయి. పర్యవసానంగా భక్తుల భద్రతను గాలికి వదిలేశారనే అపవాదు టీటీడీ, ఫారెస్ట్ అధికారులు మూటగట్టుకోవడం శోచనీయం. అటవీ శాఖ సంపద, వన్య ప్రాణుల భద్రత విషయంలో అటవీశాఖ నియమాలు చాలా కఠినమైనవి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎంత కఠిన నియమాలు ఉన్నా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులు వెలసిన తిరుమల, దాని పరిసర ప్రాంతాలను ప్రత్యేక ప్రాంతంగా పరిగణన లోకి తీసుకుని కంచె నిర్మించే విషయాన్ని ప్రత్యేక అంశంగా అటవీశాఖ చూడాలి. ఈ పరిణామాలు అన్నీ అటవీశాఖ వైఫల్యాన్ని బట్టబయలు చేశాయి. పేలవమైన అటవీశాఖ పని తీరుపై ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగేటట్లు చేసింది. కనుక అటవీశాఖాధికారులు ఇప్పటికైనా మేల్కొని భక్తులు,ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి భక్తులు, ప్రజలలో నెలకొన్న భయాందోళనలు తొలగించాలి. అదే సమయంలో అటవీశాఖకు అన్ని విధాలా సహకారం అందించవలసిన బాధ్యత ఆర్థికంగా అన్ని విధాలుగా బలీయమైన స్థితిలో ఉన్న టీటీడీపై కూడా ఉందనేది నిర్వివాదాంశం. అదేవిధంగా భక్తులు కూడా చిన్న పాటి స్వీయ జాగ్రత్తలతో నడక మార్గంలో క్రూర మృగాల వలన ఎదురయ్యే ప్రమాదాల నుంచి పూర్తిగా బయట పడవచ్చు. భక్తులు ప్రతి ఒక్కరూ భయాన్ని వదిలి సంబంధిత అధికారుల సూచనలు తూచా తప్పక పాటిస్తూ భద్రతా సిబ్బందికి సహకరించాలి. ఈ విపత్కర పరిస్థితి నుండి బయట పడేందుకు టీటీడీ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులు, ప్రజలు సమన్వయంతో ఒకరికొకరు సహకారం అందించు కోవాలి. తద్వారానే భక్తుల భద్రతకు భరోసా ఏర్పడుతుందని ఈ పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. కనుక సంబంధిత అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేసి భక్తుల భద్రతకు భరోసా కల్పిస్తారని ఆశిద్దాం

## నకిలీ పురుగు మందులతో జాగ్రత్త

అదిలాబాద్- ప్రభాత సూర్యుడు

ఆరోగ్యం కోసం వాడే మందులు కొనాలంటే వైద్యుల చీటి ఉండాల్సిందే. కొన్ని మందులకైతే వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకపోతే మందులు ఇవ్వరు. నిద్ర మాత్రలు లాంటివైతే వైద్యుల నుంచి చీటి తప్పకుండా ఉండాల్సిందే. ఎందుకంటే వాటి మోతాదు, వేసుకునే వేళలు చాలా కీలకం. వ్యవసాయంలో పురుగుల మందులు కూడా ఇలాంటివే. ఏమాత్రం ఎక్కువైనా, తక్కువైనా సమస్యే. ఎక్కువైతే పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. తక్కువైతే పురుగు నశించక అలా కూడా దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అందుకే పురుగు మందులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. విప్లవాత్మక మార్పుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నాయి. ఎరువులు, పురుగు మందులు కొనడానికి వ్యవసాయ అధికారుల నుంచి చీటిలు ఉండాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు.

# బీజేపీ-బీఆర్ఎస్ మధ్య యాదాద్రి వార్

(మొదటిపేజీ తరువాయి)

(బీహెచ్ఇఎల్)కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ దేశంలోనే అతిపెద్ద థర్మల్ పవర్ ప్లాంటుగా మారనుంది.ఈ ప్లాంటు నిర్మాణంలో కీలకమైన 5 బొగ్గు ఆధారిత బాయిలర్ల పనులు శర వేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో శరవేగంగా కొనసాగుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తికి ఏటా అవసరమయ్యే 3.5 టీఎంసీల నీటిని టెయిల్‌పాండ్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తరలిస్తారు. ఇందుకోసం చేపట్టిన 22 కిలోమీటర్ల మేర పైపులైన్, రిజర్వాయర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వేస్టేషన్ నుంచి యాదాద్రి థర్మల్ ప్లాంట్ వరకు 8.5 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ కూడా నిర్మిస్తున్నారు. అక్టోబర్ నాటికి రెండు యూనిట్ల పనులు పూర్తి చేసి విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు సిద్ధం చేశారు. మిగిలిన మూడు యూనిట్లకు సంబంధించిన పనులు 70 శాతానికి పైగా పూర్తి చేశారు. జుఖూకు పర్యావరణ అనుమతి ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో ముంబయికి చెందిన కన్సర్వేషన్ యాక్షన్ ట్రస్ట్, విశాఖకు చెందిన సమత అనే స్వచ్ఛంద సంస్థలు కేసు వేశాయి. దీంతో ఎన్జీటీ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తికి అనుమతిని నిరాకరించింది. కేవలం సివిల్ పనులు కొనసాగించడానికి అనుమతించింది. యాదాద్రి ప్లాంటు నిర్మాణంపై విచారణ జరిపిన ఎన్జీటీ.. ప్లాంట్ వల్ల ఆ ప్రాంతంలో ఉత్పన్నమయ్యే పర్యావరణ సమస్యలు దాని ప్రభావంపై అధ్యయనం చేసేందుకు టీఓఆర్ జారీ చేయాలని గత అక్టోబర్ లో కేంద్ర పర్యావరణ శాఖను ఆదేశించింది. అయితే ఇప్పటి వరకు టీఓఆర్ జారీ చేయలేదు. 34 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కు ఇప్పటికే 20 వేల కోట్లకు పైగా వెచ్చించామని జెన్కో అధికారులు చెబుతున్నారు. పర్యావరణ అనుమతుల కోసం టిఓఆర్ ను జారీ చేయాలని ఇప్పటికే కేంద్ర పర్యావరణ శాఖకు 5 లేఖలు రాశామని జెన్కో అధికారులు చెబుతున్నారు. ప్లాంట్ రెండవ దశ పర్యావరణ అనుమతి కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ను మరోసారి ఆశ్రయించాలని జెన్కో నిర్ణయించింది. టిఓఆర్ జారీపై కేంద్ర పర్యావరణ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం మండి పడుతోంది. రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నెముక లాంటి యాదాద్రి విద్యుత్ కేంద్రానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ జారీ చేయకుండా జాప్యం చేస్తే.. తెలంగాణకే కాదు మొత్తం దేశానికి నష్టమని విద్యుత్ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. అన్ని చట్టాలకు లోబడి ఈ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పూర్తి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

# వంద రోజుల ముందే జాబితా

(మొదటిపేజీ తరువాయి)

మెజార్టీ ఓట్లు రాబట్టుకోగలిగారు. అయితే ఇప్పుడు అచ్చం అలాంటి వ్యూహాన్ని బీజేపీ అధికార మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో అనుసరిస్తోంది. మధ్య ప్రదేశ్‌లో 39 మంది అభ్యర్థులను అలాగే ఛత్తీస్‌ఘడ్‌లో 21 మంది అభ్యర్థులను ఖరారు చేసేసింది. అయితే వీటిలో ఎక్కువగా రిజర్వ్‌డ్ సీట్లు ఉండగా.. మరికొన్ని సీట్లు గతంలో బీజేపీ ఎన్నడూ కూడా గెలవనివి. ఈ నేపథ్యంలో గెలుపు కఠినంగా అనిపించే నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు వీలు ఉంటుందని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. వాస్తవానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి బాగానే ఉంది. అయితే మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రస్తుతం అధికారంలో ఉండగా.. ఛత్తీస్‌ఘడ్‌లో మాత్రం ప్రతిపక్షంలో ఉంది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అందరి కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించి మంచి ఫలితాలు రాబట్టడంతో ఇప్పుడు అదే వ్యూహాన్ని బీజేపీ ప్రయోగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం మరో తరహా ఫార్ములాతో బీజేపీ దూసుకెళ్లేలా కనిపిస్తోంది. వాస్తవానికి తెలంగాణలో బీజేపీ అధిష్ఠానం ఇటీవల చేసిన మార్పుతో రాష్ట్రంలోని పార్టీ కేడర్‌లో ఒక్కసారిగా ఊపు తగ్గిపోయింది. బండి సంజయ్ లాంటి నేతను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని ఇప్పటికీ కూడా పార్టీ శ్రేణులు, ఆయన వర్గీయులు జీర్ణించు కోలేకపోతున్నారు. అయితే ఇటువంటి పరిస్థితిలో తిరిగి ఊపు తీసుకొచ్చేందుకు అధిష్ఠానం నుంచి మాత్రం పెద్దగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదు.

ఇలాంటి నేపథ్యంలో.. మధ్యప్రదేశ్, ఛత్తస్‌ఘడ్ రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంపై వందరోజుల ముందుగానే దృష్టిపెట్టిన అధిష్ఠానం పెద్దలు.. అసలు తెలంగాణపై ఎందుకు దృష్టి పెట్టలేకపోతున్నారనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి బీజేపీకి 35 చోట్ల తప్పితే మిగతా ప్రాంతాల్లో గట్టిగా పోటీ ఇచ్చే నాయకులు లేరట. అందుకోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్ జాబితాల ప్రకటన చేసిన తర్వాత గానీ బీజేపీ తమ అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే ఈలోపు గెలుపు గుర్రాల కోసం వెతుకుతున్నట్లు రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతున్నారు.

## త్వరలో ప్రతిపక్షాలకు

# బిఆర్ఎస్ పార్టీ సినిమా వుంది

(మొదటిపేజీ తరువాయి)

అంబేద్కర్ విగ్రహం, ప్రస్తుతం ఈ స్టీల్ బ్రిడ్జి వంటి అనేక కార్యక్రమాలతో సెంట్రల్ హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం. దీంతోపాటు ఇందిరా పార్కును కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ బ్రిడ్జి ఏర్పాటుతో ఇందిరా పార్క్ నుంచి విద్యానగర్ దాకా దశాబ్దాలుగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ ప్రాంతంతో అద్భుతమైన సంబంధాలు ఉన్న కీర్తి శేషులు నాయిని నరసింహారెడ్డి అనుబంధాన్ని, ఆయన ఇక్కడి ప్రజలకు? కార్మికులకు చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ స్టీల్ బ్రిడ్జికి ఆయన పేరును పెడుతున్నాం. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. గతంలో మాదిరి మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునే దుస్థితి ఈరోజు లేదు. గత పది సంవత్సరాలలో మత కల్లోలాలు, గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నది. ఇలాంటి సందర్భంలో మతాల మధ్య చిచ్చుపెట్టే దుర్మార్గులకు, చిల్లర పార్టీల వారి మోసాలకు గురైతే మరో వందేళ్లు ఈ నగరం వెనక్కి పోతుందని అన్నారు.

60 సంవత్సరాల పాటు అధికా రంలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేయని పార్టీల మోసపు మాటలు నమ్మవద్దు. ఇప్పటిదాకా చూసింది కేవలం ట్రైలర్ మాత్రమే ఇంకా త్వరలో ప్రతిపక్షాలకు బిఆర్ఎస్ పార్టీ సినిమా చూపించబోతున్నదని అన్నారు.

# గులాబీ నేతల బలప్రదర్శనలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్‌లో టిక్కెట్ రేసు జోరందకుంది. మొదటి జాబితా రెడీ అయిపోయిందని.. రేపోమాపో ప్రకటిస్తారని స్పష్టత రావడంతో.. టిక్కెట్ పై అనుమానం ఉన్న నేతలు బలప్రదర్శనకు దిగుతున్నారు. ముఖ్యంగా స్టేషన్ ఘన్ పూర్, జనగామ నియోజకవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ డౌటన్న ప్రచారం జరుగుతూండటంతో వారి అనుచరులు భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తమ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకే టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. జనగామలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు. ఆయన వరుసగా రెండు సార్లు గెలిచారు. ఆయన చుట్టూ అనేక ఆరోపణలు ఉన్నాయి. చివరికి ఆయన కుమార్తె కూడా ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి ఆయనకు టిక్కెట్ ఇవ్వడం లేదని... కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే పల్లా రాజేశ్వర్ రెడ్డికి టిక్కెట్ లభిస్తుందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో పల్లా గోబ్యాక్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. జనగామ ఎమ్మెల్యే టికెట్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిగి రెడ్డికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ, అదేవిధంగా అధిష్టానం పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఇవ్వొద్దంటూ పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. పల్లా గోబ్యాక్,

పల్లా డౌన్ డౌన్

అంటూ నినాదాలు తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు రావడంతో తీవ్ర ఉధృత పరిస్థితి నెలకొంది. ఇక స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో ఈ సారి తాటికొండ రాజయ్యకు కేసీఆర్ షాక్ ఇస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో రాజయ్య వర్గీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ల కరుణాపురం వద్ద హన్మకొండ హైదరాబాద్ జాతీయ రహదారిపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే రాజయ్య మద్దతుదారులు స్టేషన్ ఘనపూర్ బిఆర్ఎస్ టికెట్ ఎమ్మెల్యే రాజయ్య కె ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డు పై బైఠాయించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కడియం కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక నాయకుడు ముద్దు వలసదారులు వద్దు, దళిత దొర కడియం వద్దు దళిత బిడ్డ రాజయ్య ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కడియం దిష్టి బొమ్మ దహనానికి ప్రయత్నించారు. పోలీసులు వారందర్ని అక్కడ్నుంచి పంపేశారు. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ టిక్కెట్ల కోసం పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఈ సారి మారుస్తారన్న ప్రచారంతో.. ఆశావహులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. తమకే టిక్కెట్ వస్తుందన్న అంచనాల్లో ఉన్నారు. మరికొన్ని చోట్ల.. బీఆర్ఎస్ అధినేతనే టిక్కెట్ నిరాకరిస్తారని చెబుతున్నారు. ఈ క్రమంలో వారు కూడా బలప్రదర్శన చేసి.. తమ సత్తా చూపాలనుకుంటున్నారు. మరో వైపు అసంతృప్తులందర్నీ బుజ్జగించి.. మొదటి జాబితా విడుదల చేయాలని బీఆర్ఎస్ హైకమాండ్ ప్రయత్నిస్తోంది

## పోలీస్‌ల దాడిలో గాయ పడిన
# గిరిజన మహిళను పరామర్శించిన రెడ్ క్రాస్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ మామిడి భీమ్ రెడ్డి ఆగస్టు 15 వ తేదీన రాత్రి డ్యూటీ లో వున్న పోలీస్ అధికారులు లక్ష్మి అనే మహిళ మీద ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్ర హింసలు పెట్టిన సంఘటనలో గాయపడిన గిరిజన మహిళ లక్ష్మిని, కర్మన్ ఘాట్ జీవన్ హాస్పిటల్ లో పరామర్శించారు. డాక్టర్లు లతో మాట్లాడి ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని తెలిపారు. ఆమె కు పండ్లు, మందులు, రెడ్ క్రాస్ సామగ్రి అందించి మీకు అన్ని వేళ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ అందుబాటులో వుంటుందని భరోసా ఇచ్చారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెడ్ క్రాస్ వాలంటీర్లు దీక్షితులు,ెంకట్, గోపాల్ తదితరులు వెంట వెళ్లి పరామర్శించారు.

## ఎన్‌వి ఎస్ ఎస్ ప్రభాకర్ నిరసన ధర్నాకు
# రాజ్యసభ సభ్యులు కె లక్ష్మణ్ మద్దతు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్‌వీఎస్ ఎస్ ప్రభాకర్ 48 గంటల నిరసన ధర్నా రెండో రోజు న రాజ్య సభ సభ్యులు జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ విచ్చేసి నైతిక మద్దతు తెలి యజేసి సంక్షేమ పథకాల అమల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం అను సరిస్తున్న తీరుని తీవ్రంగా తప్పు పట్టారు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు ఆశ్రిత పక్షపాతం రాజకీయ కోణంలో ఎంపికల్ని ఆపాలని డిమాండ్ చేశారు. కమలదళం కదిలిందని రాబోయే రోజుల్లో కలెక్టర్ కార్యాలయాలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల ముట్టడి కొనసాగిస్తామని హెచ్చ రించారు. ముఖ్యమంత్రి ఇంకా ఎంతోకాలం ప్రజల్ని మోసగించలేరని వారు పేర్కొన్న. డబల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం, దళిత బంధువు, బీసీ బందు, గృహలక్ష్మి పథకాలు, దివాలా తీసిన ఖజానాలతో అమలు సాధ్యమేనా అని అన్నారు ఎందుకు ప్రజల్ని మోసగిస్తున్నారు అని ప్రశ్నించారు.

## ఎమ్మెల్యే చెన్నమనేని వర్గానికి టైం ఇవ్వని మంత్రి కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల - ప్రభాత సూర్యుడు :** సిరిసిల్లలో మంత్రి కెటిఆర్ కలిసేందుకు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు వర్గీయులు వచ్చారు. అయితే, వారికి మంత్రి సమయం ఇవ్వలేదు. వారితో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. వారంతా ఎమ్మెల్యే రమేష్ బాబు కే టికెట్ ఇవ్వాలని కోరేందుకు వచ్చినట్లు సమాచారం. వేములవాడ బి అర్ ఎస్ పార్టీ లో గత కొంతకాలంగా వర్గ విభేదాలు నెలకొన్నాయి. ఇప్పటికే చల్మెడలక్ష్మీ నరసంహరావు, ఏనుగు మనో హర్ రెడ్డి వేములవాడ టికెట్ అశిస్తుతున్నారు. – కెటిఆర్ కలిసేందుకు వచ్చిన వారిలో జగిత్యాల జడ్పీ వైస్ చైర్మన్ తో పాటు ఎంపిపిలు, జడ్పీటిసి లు వున్నారు. వారిని కలవకుండా మంత్రి కేటీఆర్ వెళ్లిపోవడం చర్చనీయాంశమయింది.

## అనంతగిరి రేసింగ్ యువకులు అరెస్టు

**వికారాబాద్ - ప్రభాత సూర్యుడు :** అనంతగిరి అడవుల్లో రేసింగ్ లు చేసిన యువకులను పోలీసులు అరెస్టు చేసారు. హైదరాబాద్ చెందిన ఏడుగురిని యువకులను అరెస్ట్ చేసారు. రేసింగ్ లో ఆర్గనైజ్ చేసిన శ్రీమాన్ యాదవ్ తో పాటు ఆరుగురు అరెస్టు అయ్యారు. ఏడుగురికి సంబంధించిన కార్లు బైక్లను సీజ్ చేసారు. ఆగస్టు15 న సెలవు దినం కావడంతో అనంతగిరి ఆడవుల్లో పెద్ద ఎత్తున కార్లు, బైకుల రేసింగ్‌లు నిర్వహించారు. విన్యాసాలు, స్టంట్లు చేయడంతో స్థానికులు పోలీసులకు పిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## వికలాంగుడికి స్కూటీ అందజేత



**కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు :** కమాన్‌పూర్ మండలం పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన మొగిలి అనిల్ బాబు అనే వికలాంగుడికి ప్రభుత్వం ద్వారా మంజూరైన స్కూటీని, స్థానిక బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు అందజేశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అనిల్ బాబుకు స్కూటి అందజేశారు.వికలాంగుడైన అనిల్‌బాబుకు స్కూటీ అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఢ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ని జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్ ని కోరగా వెంటనే స్పందించిన మంత్రి వికలాంగుడికి స్కూటీ మంజూరీ చేశారు. రెండు రోజుల క్రితం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్బంగా అనిల్ బాబుకు స్కూటీని ఇవ్వగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిదులు గ్రామంలో అందజేశారు. తనకు ప్రభుత్వపరంగా సాయం అందించి చేయూతనిచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ కి, మంత్రి కొప్పుల ఈశ్వర్ కి అనిల్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేష్, కమాన్ పూర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, పెంచికల్ పేట్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎద్దు రాజయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గొడిశెల సంపత్, బైరీ అంజయ్య, ఐలవెన మల్లేష్, అనవేన నర్సయ్య, కొలిపాక శంకర్, ఇరుగురాల లక్ష్మణ్, భూతపల్లి సాయి క్రిష్ణ, ఐట్ల పవన్ కళ్యాణ్, కమ్మటి సాయి, మబ్బు హరిక్రిష్ణ, దాసరి మోగిలి, ఇరుగురాల రమేష్, పెగడపల్లి రాకేష్, జంగిలి రవి, సుంకరి ప్రసాద్, పిడుగు వెంకటేష్, ధబ్బేట బద్రి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 26న కోటి మొక్కలు నాటే కార్యక్రమం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా చేపడుతున్న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈనెల 26న చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియచేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలనుసారం ఆగస్టు 26న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ఈ కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజా ప్రతి నిధులు, స్వచ్ఛంద సంఘాలు, సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని సి.ఎస్ కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్ కు వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.తెలంగాణాకు హరితహారం, దశాబ్ది సంపద వనాలు, స్వతంత్ర భారత వజ్రోత్సవం సందర్బంగా కోటి మొక్కలు నాటడం, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళిత బంధు, భూ పట్టాల పంపిణీ, సామాజిక భద్రతా పింఛనులు, కారుణ్య నియామకాలు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, వీఆర్‌ఓ ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు.రాష్ట్రంలోని అని జిల్లాల్లో పెద్ద సైజ్ కల మొక్కలు అందుబాటులో ఉన్నందున ఈ కోటి మొక్కల కార్యక్రమంలో వాటినే నాటాలని స్పష్టం చేశారు. 26 వతేదీ లోగా మొక్కలు నాటేందుకై గుంతలు తవ్వించి సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో తెలంగాణాకు హరితహారం క్రింద నిర్ధారించిన లక్ష్యాన్ని, దశాబ్ది సంపద వనాల క్రింద నిర్ధారిత లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. జూనియర్ పంచాయితీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అదే విధంగా, రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 1266 మందికి కారుణ్య నియామకాలను చేపట్టేందుకై సూపర్ న్యూమరరీ పోస్టులను మంజూరు చేసినందున, ఈ నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంతోకాలంగా ప్రజలు కోరుతున్న నోటరీ స్థలాల క్రమబద్ధీకరణకై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన మేరకు జీ.ఓ. 84 ను విడుదల చేయడం జరిగిందని, ఈ పథకానికి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన విచారించి క్రమబద్ధీకరణ చేయాలనీ ఆదేశించారు. జీ.ఓ 59 క్రింద ఇప్పటికీ నోటీసులు అందుకున్న వారి నుండి రెగ్యులరైజేషన్ కు నిర్ణయించిన మొత్తాన్ని జమ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం, ఎస్సీ అభివృద్ధి కార్యదర్శి రాహుల్ బొజ్జా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఒమర్ జలీల్, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

# కళకు వన్నె తెచ్చిన అల్ఫోర్స్ ఎన్లైవన్-2023

**కరీంనగర్ -- ప్రభాత సూర్యుడు :** నేటి కాలంలో విద్యార్థులకు సామాజిక స్పృహ చాలా అవసరమని మరియు దాని ద్వారా విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఉంటారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. రేకుర్తిలోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో కళకు వన్నెతెచ్చే విధంగా విద్యార్థుల కేరింతల మధ్య "అల్ఫోర్స్ ఎన్లైవన్-2023" పేరుతో నిర్వహించినటువంటి సాంస్కృతిక కళావైభవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ విద్యార్థులకు కళల పట్ల ఆసక్తి పెంచాలని, తగిన సమాచారం ఇవ్వాలని అబి ప్రాయపడ్డారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తితో పాటు పట్టు ఉండాలని అందులో పాల్గొనడానికై దృఢ నిశ్చయంతో ఉండాలని తెలుపుతూ ఉత్తమ ప్రదర్శనకై ప్రణాళికలను రచించాలని సూచించారు. మన దేశచరిత్ర ప్రత్యేకంగా మన తెలంగాణ రాష్ట్రం విభిన్న కళలకు విశిష్టమైనదని గుర్తుచేస్తూ మనరాష్ట్రంలో ఉన్నటువంటి కళలు సాంప్రదాయాలు చాలా గొప్పగా ఇతర రాష్ట్రాలలో,ప్రపంచంలో చాలా ప్రశంసనీయంగా అవలంబిస్తూన్నారని చెప్పారు. విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభ పాటవ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ వారిలో దాగిఉన్న కళలను వెలికి తీయడంలో సఫలీకృతులం అవుతున్నామని హర్షం వ్యక్తం చేసారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలుపుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంవైపు అడుగులు వేయడమే కాకుండా ఘనవిజయాలను సాధించాలని కోరారు. విద్యార్థులు తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉత్తమంగా సమాజంలో ఉండాలని కోరారు. విద్యార్థులంటేనే ఒక సంచలనం మరియు ట్రెండ్ అని అభివర్ణించారు మరియు వారు చేసే కృషి చాలా స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రతి ఒక్క విద్యార్థి నిర్దేశించిన లక్ష్యాలను సాధించి ఉన్నతంగా ఉపాధి అవకాశాలను ఉపయోగించుకొని ఆదర్శంగా ఉండాలని కోరారు. సమయం చాలా విలువైనదని దానిని సద్వినియోగం చేసుకొని ప్రశంసించబడాలని సూచించారు. వేడుకలను పురస్కరించుకొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అదేవిధంగా విద్యార్థులు ప్రదర్శించి నటువంటి సొగసు చూడతరమా, నా పేరు సీతయ్య, ఊహానపడితే... కొండల్లో కొనల్లో, నేనే నెం.1 తదితర నృత్యాలు చాలా అలరించాయి.ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల
# అప్రమత్తంగా ఉండండి

**- డెంగ్యూ నివారణకు తగు చర్యలు తీసుకోవాలి**
**- డెంగ్యూ నివారణ మందులు అందుబాటులో ఉంచడంతో పాటు దోమల నివారణ చర్యలు తీసుకోవాలి**
**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు మున్సిపల్ అధికారులను కోరిన ఎమ్మెల్సీ కవిత**



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత అధికారులను కోరారు.. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ తో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు.. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు.. దోమల నివారణ మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేస్తూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు.. డెంగ్యూ పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నివారణ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లో ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించద్దు అని ఆమె అధికారులను కోరారు..

## చికిత్స కోసం వచ్చిన
# యువకుడిపై కానిస్టేబుల్ దాడి

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు :** కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగిని ఔట్ పోస్టు కానిస్టేబుల్ లాఠీతో కొట్టడం వివాదానికి దారి తీసింది. సతీష్ అనే వ్యక్తి ఇంట్లో గొడవ జరగడంతో అతని కుటుంబ సభ్యులు 100కు డయల్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని గాయాలతో ఉన్న అతన్ని ఆసుపత్రికి తరలించారు. చికిత్స తీసుకుంటున్న క్రమంలో కానిస్టేబుల్ సత్యనారాయణ, సతీష్ గొడవపడగా లాఠీతో కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## శామీర్ పేట్ హకింపేట
# స్పోర్ట్స్ స్కూల్ దగ్గర ఉద్రిక్తత

**- మా సార్ మాకు కావాలంటూ నినాదలతో హోరేత్తిన స్పోర్ట్స్ స్కూల్**

**మేడ్చల్ - ప్రభాత సూర్యుడు :** గత వారం రోజుల క్రితం విద్యార్థిని పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో సస్పెండ్ అయినా ఓఎస్‌డి హరికృష్ణ ఎటువంటి తప్పు చేయలేదు అతన్ని తిరిగి స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డిగా తీసుకోని రావాలంటూ డిమాండ్ చేస్తూ స్పోర్ట్స్ స్కూల్ మెయిన్ గేట్ వద్ద బైటయించిన స్కూల్ విద్యార్థులు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలంలోని తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం స్పోర్ట్స్ స్కూల్ లోని యువతీ యువకులు ముకుముడిగా గుమ్మగూడి స్కూల్ మెయిన్ బిల్డింగ్ నుండి పరుగులు తీస్తూ రాజీవ్ రహదారి ని అనుకోని ఉన్న ముఖ్య ద్వారం వరకు చేరుకున్నారు. స్కూల్ వద్దకు చేరుకున్న పోలీసులు అడ్డుకున్న ఆగకుండా వీ వాంట్ జస్టిస్, మా సార్ మాకు కావాలంటూ అంటూ నినాదలు చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ స్కూల్ మెయిన్ గేట్ వద్ద శామీర్ పేట పోలీసు బందొబస్తూతో అడ్డుకొని పిల్లలను గేట్ లోనికి పంపించారు. అనంతరం విద్యార్థులు గేట్ లోపల బైటయించి ఓఎస్ డి హరికృష్ణ ఎటువంటి తప్పు చేయలేదు అతను తిరిగి కావాలంటూ, స్పోర్ట్స్ స్కూల్ లో అసలు జరుగుతున్న విషయాన్ని బైటికి రాకుండా కుట్రపూరితంగా ఓఎస్‌డిని సస్పెండ్ చేశారంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడినుండి కదిలేది లేదంటూ డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లైంగిక వేధింపులకు పాల్పడ్డ అసలు నిందితుడిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

## నిరుద్యోగ భృతి చెల్లించాలి:బీజేవైఎం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**

తెలంగాణలోని నిరుద్యోగులకు ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలని బీజేపీ యువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు భాగ్యనగర్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు శివచంద్రగిరి, నేషనల్ కోఆర్డినేషన్ సభ్యుడు దినేష్ యువమోర్చా నాయకులతో కలిసి సైదాబాద్ డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించి 56 నెలలు అయినా ఇప్పటివరకు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాన్నీ గద్దె దించేవరకు యువమోర్చా పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జగన్, భారత్,ఈశ్వర్,శివ, హరి పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215